

8 నుంచి కోటదుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలు

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేత కోటదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 8, 9 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కరపత్రాలను ఆవిష్కరించారు. 8న అమ్మవారికి ఆషాఢమాస సారె సమర్పణ ఉంటుందన్నారు. 9న శాకంబరిదేవిగా అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అదేరోజున లక్ష కుంకుమార్చన మహోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడంచారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 22 వరకు ఐదు శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.



యంత్రంతో కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

ముహూర్తం ఖరారు

● రేపు తోటపల్లి నుంచి సాగునీరు విడుదల

గరుగుబిల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు నుంచి ఖరీఫ్‌కు నీరు విడుదల చేసేం దుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల ఆరో తేదీన కుడి ప్రధాన కాలువ నుంచి నీటి విడుదలకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిలు హాజరు కానున్నారు. ఈ ఏడాది ముంద స్తుగా నీటి విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు. కుడి ప్రధాన కాలువ నుంచి ప్రస్తుత ఖరీఫ్‌కు 1.82 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కాలువాలన్నీ పూడికలు, పిచ్చిమొక్కలతో నిండాయి. కొన్నిచోట్ల గండ్లు కూడా పడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం కాలువల్లో గుర్రపు డెక్క, పూడిక తీతలకు సుమారు రూ. 3 కోట్లు మంజూరు చేసింది దీంతో ఉల్లిభద్ర సమీపంలోని కుడి ప్రధాన కాలువ నుంచి విజయనగరం జిల్లా తెర్లాం వరకు ఉన్న 48 కిలో మీటరు వరకు అభివృద్ధి పనులు నిర్వహిం చారు. ప్యాకేజీ-1లో భాగంగా 48 కిలో మీటర్లు, ప్యాకేజీ-2లో 48 కిలో మీటరు నుంచి 117.89 కిలో మీటరు వరకు పనులు నిర్వహించారు.

విద్యకు అత్యంత ప్రాధాన్యం

● వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరిస్తాం
● ప్రవేశాలు తగ్గడంపై సర్వే చేయండి
● రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించాలి
● జడ్పీ సమావేశంలో మంత్రులు శ్రీనివాసరావు, సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి

విజయనగరం రూరల్ జూలై 4(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. విద్య పరంగా ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ఎందుకు తగ్గాయో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేయండి.' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశ భవనంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరీతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు గతేడాది కంటే తగ్గాయని జడ్పీ చైర్‌పర్సన్ శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో 1,04,478 ప్రవేశాలు జరగ్గా, ఈ ఏడాది 96,397 జరిగాయని ఆయన సభ దృష్టికి తెచ్చారు. కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఉన్నాయని ప్రజాప్రతినిధులు సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుతో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు కూడా తమ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను తెలియజేశారు. దీనిపై మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ఎందుకు తగ్గాయో విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేయాలన్నారు. వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులు సమీకరించాలని కలెక్టర్ అంబేడ్కర్‌ని కోరారు. పదో తరగతి ఫలితాల్లో వరుసగా మూడోసారి కూడా రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచిన పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి జడ్పీ సమావేశంలో అభినందనలు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు ఉండకూడదు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. రైతులకు వరి విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ, రీసర్వేలో తప్పులు తదితర అంశాలు రైతులకు ఇబ్బందిగా మారాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. దీనికి విజయనగరం కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ సదస్సుల ద్వారా ఇప్పటికే 98 శాతం సమస్యలు పరిష్కరించామన్నారు. వచ్చే జడ్పీ సమావేశానికి ఇరు జిల్లాల పరిధిలోని ఆర్డీవోలను ఆహ్వానించాలని కలెక్టర్ (మిగతా 6వ పేజీలో...)

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

● వివిధ అవతారాల్లో దర్శనమిచ్చిన స్వామివారు 8లో



రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

● బురద రోడ్డు మీద బైక్‌పై వెళ్లిన ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో 8లో

ఐదు రోజులుగా ఒకేచోట..

● సీతంపేట మన్యంలో సంచరిస్తున్న ఏనుగులు
● కొండపోడు పనులు, పైనాపిల్ సేకరణకు వెళ్లలేకపోతున్న రైతులు 8లో

ఆపరేషన్ కగార్ మావోయిస్టుల అంతానికేనా?

● రాష్ట్ర ఇఫ్టూ అధ్యక్షుడు ప్రసాద్
● బొబ్బిలిలో గంటి ప్రసాదం వర్ధంతి సభ 8లో

ఇక డిజిటల్ మెప్మా

● అంతా ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు
● సిబ్బందికి ట్యాబ్‌ల అందజేత



రాజాం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రుణాల చెల్లింపు, రికవరీ వంటి సంస్థాగత నిర్వహణ కార్యక్రమాలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి. దీనికోసం ఇప్పటికే మెప్మా సిబ్బందికి ట్యాబ్‌లు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు, సిటీ మెషిన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు, టీఎల్ ఎఫ్, సిబ్బంది ఇకపై మెప్మాలో జరిగే లావాదేవీలు, కార్యక్రమాలన్నీ ట్యాబ్‌ల ద్వారానే నిర్వహించనున్నారు. ప్రభుత్వం మెప్మా సిబ్బందికి అందజేసిన ట్యాబ్‌ల్లో స్వయం సహాయక సంఘాల నిర్మాణం, కార్యక్రమాలు, రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించి యాప్‌లు ఉన్నాయి. ఎస్‌హెచ్‌జీల నిర్వహణ, మెప్మా సేవలన్నీ ఆన్‌లైన్‌లో మహిళా యాప్ ద్వారానే నిర్వహిస్తారు. మహిళా సంఘాల సంస్థాగత నిర్మాణం, రుణాల చెల్లింపు, రికవరీ మొత్తం ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ఎస్‌హెచ్‌జీలకు అమలు చేస్తున్న పథకాలు సైతం ట్యాబ్‌ల్లోనే నిక్షిప్తం చేస్తారు. సమావేశాల నిర్వహణ ఫొటోలు, సభ్యుల హాజరు, ఇతర అంశాలన్నీ ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటిని ఆర్పీ నుంచి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వరకూ పరిశీలించనున్నారు. దీనివల్ల అవకతవకలు జరిగేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయి.

సహకారం అంతంతే!

● రైతులకు అందని పూర్తి సేవలు ● అవగాహన కల్పించని పీఏసీఎస్ అధికారులు ● నేడు ప్రపంచ సహకార దినోత్సవం

గరుగుబిల్లి, జూలై4(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు రైతులకు వెన్నుదన్నుగా నిలిచి ఆర్థికంగా దోహదపడాలి. వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలి. సంఘాల్లోని రైతులకు అవసరమైన రుణాలు, వడ్డీ రాయితీలు కల్పిస్తూ బ్యాంకులకు దీటుగా వ్యవహరించాలి. విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తూ సాగుకు తోడ్పాటునందించాలి. కానీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఈ కేంద్రాలు ఇప్పుడు రాజకీయాలకు పునరావసంగా మారిపోయాయి. రైతులకు సేవ సంగతి అటుంచితే.. వారికి అందాల్సిన పథకాల గురించి కూడా అధికారులు అవగాహన కల్పించడం లేదు. నేడు ప్రపంచ సహకార దినోత్సవం సందర్భంగా జిల్లాలో పరిస్థితిపై ప్రత్యేక కథనం..

పట్టించుకోని వైసీపీ సర్కారు..

సంఘాల పరిధిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జిలతో నెట్టుకొచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పార్టీ నేతలకు అధ్యక్ష బాధ్యతలను అప్పజెప్పింది. అయితే ప్రజాస్వామ్యం పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే సంఘాలు పూర్తిస్థాయిలో బలోపేతమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో..

పరస్పర ప్రయోజనం కోసం కొంతమంది వ్యక్తులు సమూహంగా ఏర్పడి సహకార నియమాలు పాటిస్తూ నడిపే సంఘాన్ని సహకార సంఘంగా గుర్తిస్తారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో 1964 తర్వాత 164 సంఘాలు ఉండేవి. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 18 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 45,671 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. విజయనగరం జిల్లాలో 31 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. సుమారు 75,545 మంది రైతులు వాటిల్లో సభ్యులుగా ఉన్నారు. అయితే రైతులకు సంబంధించి వ్యవసాయం, సాగు పరికరాలు, పాడి పరిశ్రమలకు అవసరమైన రుణాలను పీఏసీఎస్‌ల ద్వారా పూర్తిస్థాయిలో అందించడం లేదు. రాజకీయ పలుకుబడి ఉన్న వారికి మాత్రమే పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సకాలంలో రుణాలు తీర్చిన వారికి వడ్డీ రాయితీ ఇవ్వడం లేదు. బంగారంపై రుణాలు కూడా మంజూరు చేయడం లేదు. ఎరువులు, విత్తనాలు సరఫరాలో కొన్నిచోట్ల అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. సహకార మిత్ర పథకం కింద ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షలు వరకు రుణం ఇవ్వాల్సి ఉన్నా.. దీనిపై రైతులకు అవగాహన కల్పించడం లేదు. సీజనల్ అగ్రికల్చరల్ ఆపరేషన్ పథకం (ఎస్ఏవో), లాంగ్ టెర్మ్ రుణాల (ఎల్‌టీ)ను కూడా మంజూరు చేయడం లేదు.

ఆన్‌లైన్ సేవలు

సహకార సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. దీనిలో భాగంగా సహకార సంఘాల పరిధిలో అవకతవకలు, అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు గాను ప్రతి సభ్యునికి ఈకేవైసీ చేయిస్తున్నారు. సంఘాల పరిధిలో లావాదేవీలు, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. మన్యం జిల్లాకు సంబంధించి 18 సంఘాల పరిధిలో 45,671 మందికి గాను 39,043 మందికి, విజయనగరం జిల్లాలో 75,545 మందికి గాను 64,679 మందికి ఈకేవైసీ చేశారు.

బలోపేతానికి చర్యలు

సహకార సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఉమ్మడి జిల్లాల పరిధిలోని 94 పీఏసీఎస్‌లకు డీసీసీబీ నుంచి పూర్తిస్థాయిలో రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఈ ఏడాది రూ. 2600 కోట్ల లావాదేవీలను లక్ష్యంగా పెట్టుకున్నాం. డీసీసీబీ బ్యాంకుకు రూ. 7.66 కోట్లు నిరక ఆదాయం వచ్చింది. ఇందులో ఒక శాతం పీఏసీఎస్‌ల అభివృద్ధికి కేటాయించాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పీఏసీఎస్‌లను తీర్చిదిద్దుతున్నాం.

- సీహెచ్ ఉమామహేశ్వరరావు, సీఈవో, డీసీసీబీ, విజయనగరం



గరుగుబిల్లిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనం



కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ

అల్లూరి సేవలు చిరస్మరణీయం

● జేసీ శోభిక ● కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు

పార్వతీపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్. శోభిక అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అల్లూరి సేవలు చిరస్మరణీయమని ఆమె తెలిపారు. బ్రిటీష్ వారిపై ఆయన జరిపిన పోరాటం.. చూపిన వీరత్వం.. అందరికీ ఆదర్శమన్నారు. అల్లూరి దేశభక్తి, తెగువ, ధైర్య సాహసాలను నేటి తరం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి

● మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి 6లో

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

7లో



నేనే ఈఈ.. కాదు నేనే..

● గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌శాఖలో తేలని కుర్చీలాట
● తగ్గేదెలే అంటున్న పాత ఈఈ
● సర్దుకుపోదాం అంటున్న కొత్త ఈఈ
● తలలు పట్టుకుంటున్న కార్యాలయ సిబ్బంది
● తప్పని పాలనాపరమైన ఇబ్బందులు



ఇంజనీరింగ్‌శాఖ కార్యాలయంలో ఈఈ చాంబర్‌లో కూర్చున్న పాత ఈఈ రమాదేవి

సీతంపేట రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్‌శాఖలో కుర్చీలాట తేలడం లేదు. ఈఈ సీటు కోసం ఇద్దరు అధికారుల మధ్య కీచులాట నెలకొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తానే ఈఈ అని ఒకరు.. కాదు కోర్టు అనుమతులు తనకే ఉన్నాయని మరొకరు చెప్పుకోవడంతో ఆ శాఖ కార్యాలయ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఎవరితో ఎలా ఉండాలో, ఎవరితో ఏం మాట్లాడాలో తెలియక మిన్నకుండిపోతున్నారు. దీనిపై ఇటీవలే ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్పష్టత ఇచ్చినప్పటికీ ఆశాఖలో ఉన్నతాధికారులు వెనక్కి తగ్గడం లేదు. దీంతో కార్యాలయంలో పాలనా పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పనితీరుపై బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలో ఆశాఖలో కీలకమైన కుర్చీ కోసం ఇద్దరు అధికారుల మధ్య నెలకొన్న వివాదం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

ఇదీ పరిస్థితి..

గత నెల 9న సీతంపేట గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ ఈఈగా కేవీఎస్ఎన్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ జీవోలోనే ఇక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న పి.రమాదేవిని నెల్లూరు ఐటీడీఏకు బదిలీ చేస్తు ఆదేశాలు వచ్చాయి. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఈఈ రమాదేవి తన బదిలీని సవాల్ చేస్తు కోర్టును ఆశ్రయించారు. ఆమె బదిలీని ఆరువారాల పాటు నిలుపుదల చేస్తు న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చిన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇక్కడ రెగ్యులర్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న కేవీఎస్ఎన్ కుమార్ కూడా కోర్టును ఆశ్రయించి నట్లు తెలిసింది. వీరి పంచాయతీ కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు రెగ్యులర్ ఈఈగా కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. కాగా గురు, శుక్రవారాల్లో పాత ఈఈ రమాదేవి కార్యాలయంలోని ఈఈ గదిలోని సీటులోనే కూర్చొన్నారు. దీంతో రెగ్యులర్ ఈఈ కుమార్ చేసేది లేక ఆ గదికి ఎదురుగా (మిగతా 6వ పేజీలో...)



సీతంపేట ఐటీడీఏలోని టీబ్ల్యూ ఇంజనీరింగ్ ప్రధాన కార్యాలయం



అదే కార్యాలయంలో డీఈ సీట్లో కూర్చొని విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఈఈ కుమార్

విప్లవ జ్యోతి అల్లూరి



పార్వతీపురం: విజయనగరం జడ్పీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రులు సంధ్యారాణి, శ్రీనివారావు, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విజయచంద్ర, ఎమ్మెల్సీ శ్రీనివాసనాయుడు



విజయనగరం కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న జేసీ సేతు మాధవన్

● ఘనంగా

సీతారామరాజు జయంతి

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని పలువురు వక్తలు అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. సీతారామరాజు చిన్న వయస్సులోనే బ్రిటిష్‌వారితో పోరాడి, తుది శ్వాస విడిచారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



పార్వతీపురం: ఐటీడీఏ కార్యాలయంలో అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పీవో శ్రీవాత్సవ



బొబ్బిలి: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



విజయనగరం క్రైం: అల్లూరి చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరంలో నివాళి అర్పిస్తున్న పార్వతీపురం మన్యం, విజయగనరం కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్, అంబేద్కర్



గుమ్మలక్ష్మీపురం: నివాళి అర్పిస్తున్న ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు



సీతంపేట రూరల్: మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



బెలగాం: సీతారామరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

నేనే ఈఈ.. కాదు నేనే..

(5వ పేజీ తరువాయి)

ఉన్న డీఈ రూంలోని సీట్లో కూర్చొని విధులు నిర్వహించారు. దీంతో కార్యాలయ సిబ్బంది ఎవరి వద్దకు వెళ్లే ఎవరూ ఏమనుకుంటారోనని లోలోపల మథనపడుతన్నారు. ఇటువంటి సమస్య తమకెప్పుడూ ఎదురు కాలేదని వారు ఊసులాడుకోవడం కనిపించింది. ఈ వివాదాన్ని సద్దుమణిగేలా చూడాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికే ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ వివాదానికి తెరదించారు. అయినప్పటికీ మళ్లీ ఈఈ పోస్టుకోసం కుర్చీలాట మొదలైంది. ఇద్దరు ఈఈలు వేర్వేరు గదుల్లో ఉండడంతో వివాదం కాస్త ముదిరింది.

అందుకే రిలీవ్ కావట్లే..

'సీతంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నాకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అందుకనే ఈఈ సీట్లో కూర్చుంటున్నా. ఇందులో వివాదం ఏముంది. నా బదిలీకి సంబంధించిన జీవోను కోర్టు కొట్టివేసింది. అందుకే నేను ఇక్కడ నుంచి రిలీవ్ కావడం లేదు.' అని పాత ఈఈ రమాదేవి సమాధానమిచ్చారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే..

'సీతంపేట గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్‌శాఖ ఈఈగా ప్రభుత్వం నాకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు రెగ్యులర్ ఈఈగా విధులు నిర్వహిస్తున్నా. దీనిలో వివాదం ఏముంది. చిన్నపాటి సమస్యలే.. సర్దుకుపోతాం. అని ఈఈ కేవీఎస్ఎన్ కుమార్ తెలిపారు.

విద్యకు అత్యంత ప్రాధాన్యం


(5వ పేజీ తరువాయి)

సూచించగా.. అందుకు జడ్పీ చైర్మన్ అంగీకరించారు. కురుపాం ఎంపీపీ, జడ్పీటీసీలు వ్యవసాయశాఖ ఏవోపై ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులకు సమాచారం కచ్చితంగా అందాలని, ప్రభుత్వ పథకాల్లో అందరినీ భాగస్వాములు చేయాలని అన్నారు.

ఏనుగుల సమస్యను పరిష్కరించండి

ఉమ్మడి జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించాలని జడ్పీ చైర్మన్‌తో పాటు పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు కోరారు. దీనిపై విజయనగరం జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు స్పందిస్తూ.. గజరాజుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుంకీ ఏనుగులు తీసుకు వచ్చిందన్నారు. అదే విధంగా 50 మంది నిష్ణాతులైన యువ టేకర్స్‌ని సిద్ధంగా ఉంచామన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా భవానీ మాత



పార్వతీపురంటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద గల భవానీ మాత ఆలయంలో గల అమ్మవారు శుక్రవారం శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలంగి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా..

● మున్సిపల్ కమిషనర్‌పై చైర్‌పర్సన్ ఆగ్రహం

పార్వతీపురంటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'నీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా.. పాలకవర్గ సభ్యులంటే లెక్కలేదా..' అంటూ మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లుపై మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన చాంబర్‌లో ఆమె మున్సిపల్ కమిషనర్‌తో సమావేశం అయ్యారు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రభుత్వానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తనతో పాటు తమ పాలకవర్గ సభ్యులకు(వైసీపీ) ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని నిలదీశారు. రాజకీయాలకు అతీతంగా అధికారులు పనిచేయాల్సి ఉండగా కమిషనర్ స్థాయిలో ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపాల్టీ ప్రథమ పౌరురాలుగా తనకంటూ ప్రత్యేక అధికారాలు ఉన్నాయని తెలియదా అంటూ కమిషనర్‌ను మందలించారు. దీనికి కమిషనర్ సమాధానం ఇస్తూ మళ్లీ ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూస్తానని చైర్‌పర్సన్‌తో అన్నారు.

డోలీలో తీసుకెళ్తారనుకోలే..

సాలూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తనకు బీపీ డౌన్ అయితే మాత్ర వేసుకుని పడుకున్నానని, స్పృహలో లేని తనను డోలీలో మోసుకెళ్లారని ఎగువ కషాయివలస ఆశా వర్కర్ శ్యామల తెలిపారు. ఎగువ కషాయివలసకు చెందిన ఆశా వర్కర్ శ్యామలకు అస్వస్థతకు గురైతే డోలీలో ఐదు కిలోమీటర్లు తీసుకొచ్చి, కురుకూటి నుంచి జీపులో సాలూరు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం శుక్రవారం పలు పత్రికల్లో ప్రచురితమయ్యింది. దీంతో కురుకూటిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ కూడా చేశారు. అయితే ఈ విషయమై ఆమె శుక్రవారం మీడియాకు వీడియో విడుదల చేశారు. తనకు బీపీ డౌన్ కావడంతో మాత్ర వేసుకుని పడుకున్నానని, అయితే ఇలా డోలీలో మోసుకెళ్లారని తెలియదన్నారు. ఇది గిట్టక చేసినట్టుందని ఆరోపించారు.

మురుగునీటితో అవస్థలు

సాలూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో కామాక్షి అమ్మవారి దేవాలయానికి వెళ్లే భక్తులు, శ్రీనివాస కాలనీవాసులు తిప్పలు పడుతున్నారు. సాలూరులో గత ఎనిమిది రోజుల నుంచి వర్షాలు కురుస్తునే ఉన్నాయి. సాలూరులో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షం కురిసింది. దీంతో శ్రీనివాసకాలనీ వద్ద కాలువలో మురుగునీరు కామాక్షి దేవాలయానికి వెళ్లే దారిలో నిలిచిపోయింది. దీంతో భక్తులు, కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు.

కూటమితోనే అభివృద్ధి

● మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి

సాలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని 21, 22 వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం-సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా వార్డు వాసులు ఆమెకు స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బందాపు సీతమ్మ, అల్లు అప్పయ్యమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, బృందావనం అశోక్, కారేపు చంద్ర తదితరులు పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని వెలుగుబాటలో నడుపుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రజల ప్రభుత్వం ఇది అని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కన్నపుదొరవలస పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఆమె సుపరిపాలన మొదటి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వారికి అవగాహన కల్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, పార్టీ అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





సాలూరు, జియ్యమ్మవలస: కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి

సక్రమంగా ఎరువులు అందించాలి

సాలూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులు అందించాలని ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ కోరారు. శుక్రవారం పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రవీంద్ర మాట్లాడుతూ రైతులు కోరిన ఎరువులివ్వాలన్నారు. ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ ఎరువుల విషయమై రైతులకు ఇబ్బంది పెట్టవద్దన్నారు. పాంచాళి సర్పంచ్ యుగంధర్ మాట్లాడుతూ ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాలని కోరారు. ఏవో తిరుపతిరావు వివరణనిస్తూ మండలానికి 600 టన్నుల ఎరువులు వచ్చాయని తెలిపారు. పాచిపెంట, మాతుమూరు, పాంచాళి గ్రామాలకు జలజీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయి వేస్తామని చెప్పి రెండేళ్లు అయ్యిందని, ఇంకెప్పుడు వేస్తారని పాచిపెంట ఎంపీటీసీ దండి ఏడుకొండలు ప్రశ్నించారు. ఇవి పెద్ద గ్రామాలు కావడంతో గుత్తేదారు రాకపోవడంతో కాల పరిమితి ముగిసిందని, మళ్లీ టెండర్లు పిలవనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామాంజనేయులు వివరణ ఇచ్చారు. మండలంలో వ్యాధులు ప్రబలకుండా కార్యాచరణ చేశామని వైద్య శాఖ డీడీ డి.శివకుమార్ అన్నారు.

రథోత్సవాల పరిశీలన



అధికారులు, ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జగన్నాథస్వామి రథోత్సవాలను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రథ యాత్ర జరుగుతున్న తీరును ఈవో సర్వేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈనెల 5న శనివారం మారు రథయాత్ర పురస్కరించుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. యాత్రకు వస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మూడు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న విజయ ఆసుపత్రి యాజమాన్యానికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట పలువురు అధికారులు, నాయకులు ఉన్నారు.

అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి చర్యలు

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చొరవతో పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు నూతన భవనం మంజూరైంది. ఈ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేశానన్నారు. త్వరలో భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు.

పనిభారం తగ్గించాలంటూ నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

గరుగుబిల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తమకు పనిభారం తగ్గించాలని గ్రామ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల్లో ఉదయం 6 గంటలకు విధులకు హాజరుకావడం, చెత్త సేకరణ, పారిశుధ్యం వంటి పనులు నిర్వహించడం వంటి వాటిపై కొంతమేర అసౌకర్యం నెలకొందన్నారు. సచివాలయాల డీడీవో హోదా తొలగించి పంచాయతీఈ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శుల సమస్యలపై స్పందించకుంటే ఈనెల 9న పెన్‌డౌన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సకాలంలో స్పందించకుంటే 15వ తేదీన శాంతియుత నిరసనలు చేపడతామని చెప్పారు. ఈ సమస్యలను ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావులకు తెలియపర్చారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి

పార్వతీపురంటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పదోన్నతులతో పాటు, ఖాళీలను భర్తీ చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిపో కార్యదర్శి కె.నర్సింగరావు, అధ్యక్షుడు నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని వైస్ ఎంపీపీ వాకమూడి అనీల్‌కుమార్ అన్నారు. అంపిలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మండలంలో అంపిలి గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచడానికి ప్రయత్నిస్తానన్నారు. సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు, రాష్ట్ర తూర్పుకాపు డైరెక్టర్ గండి రామినాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ చింత సంగంనాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

మక్కువ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి మునగాల నాగభూషణరావు కోరారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి కోసం ఎవరైనా ప్రతిపాదనలు తెలియజేయాలన్నారు. సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి భద్రతా కిట్లను అందించారు. సర్పంచ్ ఒంటి రామలక్ష్మి, పంచాయతీ కార్యనిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండండి

బెలగాం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పెంచి భవిష్యత్తు తరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు అన్నారు. పొగాకు వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక డీవీఎం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్లు ప్రదర్శించారు. హెచ్ఎం వి.శ్రీధర్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

19 వార్డుల్లో పసుపు జెండా ఎగరాలి

● టీడీపీ అరకు పార్లమెంటరీ పరిశీలకుడు హర్షవర్ధన్



మాట్లాడుతున్న హర్షవర్ధన్

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో 20 వార్డులకు 19 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించాలని పార్టీ అరకు పార్లమెంటరీ పరిశీలకుడు హర్షవర్ధన్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని నక్కలపేటలో గల కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన టీడీపీ పట్టణ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పాలకొండ టీడీపీ కంచుకోటగా ఉందని, అటువంటిది గత ఎన్నికల్లో మూడు సీట్లకే పరిమితం కావడం బాధాకరమన్నారు. ఒకే నాయకత్వంలో పార్టీ ముందుకు వెళ్లడం శుభ పరిణామమని, దీనిని కొనసాగించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో పార్టీ బలంగా ఉందని, భవిష్యత్తులో దీనిని మరింత బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, నాయకులు సుంకరి అనీల్‌దత్, పడాల రాంబాబు, అంపోలు శ్రీనివాసరావు, హనుమంతు తమ్మారావు, శిల్లా గుప్తా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయ అభివృద్ధికి విరాళం

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని షిర్డీసాయిబాబా ఆలయ అభివృద్ధికి టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు రూ.50వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన శుక్రవారం ఈ మొత్తాన్ని అందజేశారు.

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ

సాలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మెప్మాలో సంస్థ సిబ్బందికి అందజేసిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. శుక్రవారం సాలూరులోని తన కార్యాలయంలో ఆమె మెప్మా సిబ్బందికి ట్యాబ్‌లను అందజేశారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వీసీలో కలెక్టర్

పార్వతీపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పీ-4పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వీరఘట్టం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సంతనర్సిపురం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 8వ తేదీన పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేసి, అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తామని తెలిపారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మక్కువ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న స్థానిక ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

జియ్యమ్మవలస, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు. బీజే పురం, చినమేరంగి పీఏసీఎస్ నూతన అధ్యక్షులు సోముల మాస్టారు, రెడ్డి బలరామస్వామినాయుడులు శుక్రవారం ఆమెను కలిశారు. ఈసందర్భంగా ఆమె వారిని సన్మానించారు. నాయకులు డొంకాడ రామకృష్ణ, బొంగు సురేష్, జోగి భుజంగరావు, పల్ల రాంబాబు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుడికి సన్మానం

జియ్యమ్మవలస, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న బొత్స నాగార్జునకు హెచ్ఎం అల్లు రవిప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈయన బదిలీపై జోకిశీల టీడబ్ల్యూఏహెచ్ స్కూల్‌కు వెళ్తున్నారు.



ఇళ్ల మంజూరెప్పుడు?

●ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా చర్యలు శూన్యం ●జిల్లాలో ఆశావహుల ఎదురుచూపు

లక్కవరపుకోట, జూలై4 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు. ఇందుకోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. పేదలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.2.50 లక్షలు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. అది కాకుండా మరో రూ.30 వేలు అదనంగా ఉపాధి హామీ పథకం నుంచి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చేది. చంద్రబాబు ప్రభుత్వం దానిని రూ.2.80 లక్షలకు పెంచుతున్నట్టు హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇల్లు మంజూరు చేయకపోవడంతో కొల్లు నిర్మించుకోవాలనేవారు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 27 మండలాలు, 4 పట్టణ కేంద్రాల్లో సుమారు 36 వేల మంది ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నారు. వీరిలో చాలా వరకు పునాదుల స్థాయిలో నిర్మాణాలు ఉన్నాయి. లబ్దిదారుల వివరాలు మొత్తం గృహ నిర్మాణశాఖ అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రేగిడి, సంతకవిటి, బొబ్బిలి, రాజాం, గుర్ల, మెంటాడ, వంగర, పూసపాటిరేగ, తెర్లాం, మెరకముడిదాం, రామభద్రపురం, నెల్లిమర్ల, జామి, గరివిడి, బాడంగి, గజపతినగరం గంట్యాడ మండలాల్లో ఎక్కువ మంది లబ్దిదారులు ఉన్నారు. వారంతా ఇల్లు మంజూరైన తర్వాత నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

లబ్ధిదారుల వివరాలు పంపించాం..

జిల్లాలో బీపీఎల్ సర్వే చేసిన మొత్తం ఇళ్లకు సంబంధించిన వివరాలు స్వీకరించాం. ప్రభుత్వానికి లబ్ధిదారుల వివరాలు పంపించాం. మంజూరైతే నిర్మాణాలకు ఆదేశాలు ఇస్తాం. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం.

-జి.మురళీమోహన్, పీడీ,
జిల్లా గృహ నిర్మాణశాఖ, విజయనగరం



లక్కవరపుకోటలో అనుమతి లేకపోవడంతో నిలిచిన ఇంటి నిర్మాణం

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం

విజయనగరం క్రైం, జూలై4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు.

తప్పుడు కేసు పెట్టిన వ్యాపారి అరెస్టు

సాలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన బంగారు షాపు వ్యాపారి కొలగట్ల వెంకట గోపాలరావును పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో బంగారం వ్యాపారం చేస్తున్న గోపాలరావు.. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రంభ రజనీకాంత్‌పై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టించాడు. విచారణలో పోలీసులను తప్పుతోవ పట్టించినట్టు రుజువు కావడంతో గోపాలరావు పెట్టిన కేసును కోర్టు కొట్టివేసింది. తనపై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టిన బంగారం వ్యాపారిని అరెస్టు చేయాలని ఉపాధ్యాయుడు కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఆదేశాల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి 41ఏ నోటీసు ఇచ్చి అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు.

యూటీఎఫ్ అధ్యక్షుడిగా ప్రసాద్

వంగర, జూలై4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ప్రసాద్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫెడరేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో కె.రమణ, మురళి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సర్వజనాసుపత్రిని తరలించండి

విజయనగరం దాసన్నపేట, జూలై4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాసుపత్రిని తక్షణమే మెడికల్ కళాశాలకు తరలించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. శుక్రవారం సర్వజనాసుపత్రిలో ప్రజా సంఘాల నేతలతో నిరసన తెలిపారు. సర్వజనాసుపత్రి ప్రాంగణంలో తగినంత వసతి లేకపోవడం వల్ల రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సువిశాల ప్రాంగణంలోని మెడికల్ కళాశాల ప్రాంగణానికి మారిస్తే మేలన్నారు. కార్యక్రమంలో రామచంద్రరాజు, కొండబాబు, టీవీరమణ, ప్రభాకరరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కువైట్‌లో ఉద్యోగాలు

బెలగాం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏపీకి చెందిన ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ.. ధ్రువియా భాగస్వామ్యంతో కువైట్‌లోని నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాల కోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ప్రారంభించాయని ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ తదితర వాటిల్లో ఐటీఐ, డిప్లొమో కలిగి 3-5 సంవత్సరాల అనుభవం ఉన్న 25 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9988853335ను సంప్రదించాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. పాలకొండలోని బల్లంకివారి వీధిలో గల సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 9న దేశవ్యాప సమ్మెలో రైస్‌మిల్లు ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు రాము, శ్రీనివాసరావు, వైసింహులు, స్వామినాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

●కురుపాం: ఈనెల 9వ తేదీన చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. ు శుక్రవారం కురుపాంలో పోస్టర్‌ను విడదల చేశారు. సీపీఐ నాయకుడు జి.సూరయ్య, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఎం.కొత్తవలసలో మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని వేమలి, రంగుపురం గ్రామాల్లో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లారు. ఏడాదిలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. భావితరాల భవిష్యత్ మెరుగ్గా ఉండాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు విజన్ 2047తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశామన్నారు. గజపతినగరంలో రెండు పార్కులు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వాటిని ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, గుండ్రోతు గోవింద పాల్గొన్నారు.

పరిశ్రమలు రాకుండా వైసీపీ రాద్ధాంతం

విజయనగరం, జూలై4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పరిశ్రమలు రాకుండా చేయడానికి ఊహాజనిత ప్రశ్నలతో వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. విజయనగరంలో శుక్రవారం నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో తాటిపూడి నీటి ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రశ్నలకు కౌంటర్ ఇచ్చారు. జిందాల్ భూముల్లో పరిశ్రమలకు ఎక్కడ నుంచి నీరిస్తారని, ఎంత నీరు అవసరమవుతుందని ఊహాజనిత ప్రశ్నలతో రాద్ధాంతం చేయడానికి చూడటం సరికాదన్నారు. జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌లో ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు అవుతాయో ప్రస్తుతం ప్రభుత్వంలో ఎటువంటి చర్చ జరగలేదన్నారు. పరిశ్రమలపై స్పష్టత లేనప్పుడు తాటిపూడి నీరు ఇచ్చే ప్రస్తావన ఎందుకో అర్థం కావడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోను తెర పైకి తెచ్చి రైతాంగాన్ని ఆందోళనకు గురిచేయడానికి చూస్తున్నారన్నారు. నీటి పేరుతో రాజకీయాలు చేయడానికి చూడటం దారుణమన్నారు. తాటిపూడి రైతులు వైసీపీ ట్రాప్‌లో పడొద్దని కోరారు. ఇది రైతుల ప్రభుత్వమన్నారు.

కార్యకర్తల సంక్షేమమే పరమావధి




అభివృద్ధి పనుల భూమిపూజలో ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జూలై4 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటానని, వారి సంక్షేమమే పరమావధిగా పనిచేస్తానని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్‌లో పాటు కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల్లో 90 శాతం పరిష్కరించామన్నారు. గడచిన ఏడాదిలో నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వెల్లడించారు. అంతకుముందు మున్సిపాలిటీ పరిధిలోని కొండకవీధిలో రూ.8.5 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, కాల్వలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కోండ్రు జగదీశ్, నంది సూర్యప్రకాశరావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, పిల్లా సత్యంనాయుడు, మరిపి జగన్మోహనరావు, గంధి గోపి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి పరుగులు

సంతకవిటి, జూలై4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం కొండగూడెం నుంచి ఎమ్మార్ అగ్రహారం వరకు రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఇందుకుగానూ రూ.94 లక్షలు వెచ్చించనున్నారు. అనంతరం కొండగూడెం, కృష్ణంవలసల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఏడాది పాలనలో మంచిని ప్రజలకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, రాజాం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్, మండల అధ్యక్షుడు గట్టి భాను, సమతం శ్రీను, చెలికాని మహేశ్‌బాబు, గురవాన నారాయణరావు, చల్లా శ్రీరాములు, మొయ్యి నారాయణప్పడు, రావు రవీంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

భోగాపురం, జూలై4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో దాట్ల కీర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కొంత మంది రైతులు ఆర్డీవోను కలిసి ముటేషన్, తదితర సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నామని ఆమెకు తెలిపారు. దీంతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రమణమ్మను ఆదేశించారు. డీటీ హరి, సర్వేయర్ మధుకేశవరావు తదితరులున్నారు.

శ్రీరామావతారంలో జగన్నాథుడు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న హోం మంత్రి అనిత

విశాఖపట్నం/నెల్లిమర్ల, జూలై4 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా విశాఖపట్నం వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో ఏటా రోజుకొకటి చొప్పున జగన్నాథుని దశావతారాల్లో అలంకరిస్తారు. ఇందులో భాగంగా బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి శుక్రవారం శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయం నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలను సమకూర్చగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వాటిని స్వామికి సమర్పించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఆలయ కార్యనిర్వాహక అధికారి టి.రాజగోపాలరెడ్డి హోంమంత్రి అనితకు సంప్రదాయ స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనమిచ్చి ప్రసాదం అందజేశారు. పెద్దసంఖ్యలో భక్తులు రామావతారంలో ఉన్న జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో సుపరిపాలన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా

మెరకముడిదాం, జూలై4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతోందని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకుపోతోందన్నారు. శుక్రవారం పతివాడపేటలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రయంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కళా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు కట్టుబడి ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పతివాడపేటలో రూ.1.65 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులక ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, తహసీల్దార్ సులోచనరాణి, మండల పార్టీ అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై మరింత వేగంతో అభివృద్ధి




మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

జామి, జూలై4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఇకనుంచి సీఎం చంద్రబాబు గేరు మార్చి అభివృద్ధి, సంక్షేమాన్ని మరింత వేగవంతం చేయనున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం జామిలో ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ప్రభుత్వ పాలనపై అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, టీడీపీ నేతలు వర్రి రమణ, రాయవరపు శ్రీను, రాయవరపు శంకర్, బీజేపీ మండల అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ అధికారులతో విజన్ 2047పై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మండల ప్రత్యేకాధికారి మురళీ పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సువ్వాడ

నెల్లిమర్ల, జూలై4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. బొప్పడాం, అలుగోలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బొంతు వెంకటరమణ, నల్లం శ్రీనివాసరావు, బొంతు పరశురాం, కురిమి నేని దివాకర్, కెల్ల నారాయణ అప్పలనాయుడు, బొమ్మిడి రాము పాల్గొన్నారు.

వాసవీమాతకు గోరింటాకు అలంకరణ



జామి, జూలై4 (ఆంధ్రజ్యోతి): జామిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఆర్యవైశ్యులు గోరింటాకు అలంకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢమాసం సందర్భంగా గోరంటాకుతో అలంకరణ చేశామన్నారు.

పారిశుధ్య వ్యవస్థను పటిష్ఠం చేయండి



నెల్లిమర్లలో జడ్పీ సీఈవో సత్యనారాయణ



డెంకాడలో డీఎల్‌పీవో శిరీషారాణి

నెల్లిమర్ల, జూలై4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ సూచించారు. కొండగుంపాంలో శుక్రవారం ఉదయం ఆయన పర్యటించారు. గ్రామంలో గ్రీన్ అంబాసిడర్స్ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్న తీరును సమీక్ష చేశారు. గ్రామస్థులతో మాట్లాడారు. ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తను రోడ్లపైన, కాలువల్లో వేయకుండా ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, ఎంపీడీవో రామకృష్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో జి.శంకర్ జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి తౌడు పాల్గొన్నారు.

డెంకాడ, జూలై4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవలస పంచాయతీలో పారిశుధ్య పనులను శుక్రవారం డీఎల్‌పీవో ఆర్.శిరీషారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, క్లీనింగ్ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆమెతో పాటు ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు ఉన్నారు.

15 తులాల బంగారం చోరీ

సాలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలకట్టు వీధికి చెందిన కోట దేవి ఇంటిలో 15 తులాల బంగారం చోరీ అయినట్లు శుక్రవారం ఫిర్యాదు అందిందని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న దేవీ తన కుటుంబ సభ్యులతో తీర్థయాత్ర నిమిత్తం ఒడిశా రాష్ట్రంలోని గుప్తేశ్వరానికి వెళ్లారు. ఈనెల 4న తీర్థయాత్రలు ముగించుకుని ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తెరిచి ఉంది. అందులో 15 తులాల బంగారు, వెండి, సామాన్లు చోరీకి గురైనట్టు కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్లూస్ టీంతో ఘటనా స్థలాన్ని సందర్శించి బీరువా, ఇంటి గేట్లపై ఫింగర్ ప్రింట్లను తీసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

విజయనగరం క్రైం, జూలై4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జీఆర్‌పీసీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ బాలాజీరావు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులను గంజాయితో అరెస్టు చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన ఎస్.పవన్, టి.వీరాంజని, ఎస్.సుదర్శన్ రాయగడ నుంచి రైలులో విశాఖ మీదుగా కర్నూలుకు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అలాగే కొర్బా-విశాఖ రైలులో రాజస్థాన్‌కు చెందిన బాలసోని, ఢిల్లీకి చెందిన ప్రియా గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారు. 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

16 మద్యం సీసాల స్వాధీనం

పూసపాటిరేగ, జూలై4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపురంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారన్నారు.

తాటిపూడి నీటిపై స్పష్టత ఇవ్వండి



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి నీటిని పరిశ్రమలకు ఇవ్వమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టత ఇవ్వాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. గతంలో జారీ చేసిన జీవో 14ను రద్దు చేయాలని కోరుతూ బొడ్డవరలోని జాతీయ రహదారిపై నిర్వాసితులు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిర్వాసితులు ఆందోళన కొనసాగించారు. ●ఇదిలా ఉండగా మండలంలోని జిందాల్ నిర్వాసితులు శుక్రవారం విజయనగరంలో రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కలిశారు. న్యాయపరమైన హక్కుల సాధన కోసం పోరాడుతున్న తమకు అండగా నిలవాలని కోరారు.

సచివాలయ భవన నిర్మాణంపై రగడ

డెంకాడ, జూలై4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సచివాలయ భవనం నిర్మాణంపై రగడ జరిగింది. శుక్రవారం డెంకాడలో సర్పంచ్ సతివాడ గౌరీ అధ్యక్షతన సచివాలయంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపడుతున్న సచివాలయ భవనంపై అప్పట్లో టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై కూటమి నాయకుల మధ్య వాగ్వావాదం చివరకు గొడవకు దారితీసింది. కోర్టులో ఉన్న విషయంపై ఇప్పుడు ఎందుకు రాద్ధాంతం చేస్తారని నాయకులు కలుగజేసుకుని తర్వాత మాట్లాడుదామని సర్దిచెప్పారు. గ్రామసభలో ఎంపీటీసీ కోరాడ కుమారి, పాణిరాజు, కోయినేని రమణ, చల మూరు మహేశ్వరరావు, జనసేన నాయకుడు సిరికి అప్పారావు, బీజేపీ నాయకులు కర్రి కృష్ణ, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, సచివాలయం కార్యదర్శి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

● గ్రామసభలో జనసేన నాయకుల డిమాండ్



జనసేన నాయకులను నిలువరిస్తున్న పోలీసులు

గజపతినగరం, జూలై4 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు బూర్లి రాము, కలిగి పండు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నరవ కొండమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి అద్దెలకు ఇస్తున్నారని జనసేన నాయకులు ఆరోపించారు. దీనివల్ల పంచాయతీ స్థలం కొన్నాళ్లకు పూర్తిగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక అందజేస్తే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. గ్రామసభలో జనసేన నాయకుడు బూర్లి రాము అధికారులను ప్రశ్నించడంతో ఏఎంసీ చైర్మన్‌తో పాటు సర్పంచ్ అడ్డుతగిలారు. ప్రతీ అధికారిని నిలదీయడం సబబుకాదన్నారు. అధికారులు మాట్లాడిన తర్వాత ఎటువంటి సమస్య ఉన్నా అడిగి తెలుసుకోవాలని సూచించారు. దీంతో రాము మరింత ఆవేశానికి గురవ్వడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పారు. ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉన్నాయనే విషయాన్ని మరువరాదన్నారు. ప్రతీ విషయానికి అధికారులపై ఒత్తిడి తీసుకురావడం మంచిదికాదని హితవు పలికారు. గ్రామసభలో ఈవోపీఆర్‌డీ సుగుణాకరరావు, ఈవో జనార్దనరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయండి

రాజాం రూరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంతో పాటు కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు కార్మికులను అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



సాలూరు రూరల్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పాలకొండ: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాలకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేటలో ఉన్న సకల దేవతల ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పర్రి శరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త కొండబాబు, భక్తులు పాల్గొన్నారు.

●సాలూరు రూరల్: సాలూరు కామాక్షి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో వారాహి మాతకు శుక్రవారం వైభవంగా కుంకుమ పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ముద్దు సత్యనారాయణ గురువు ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.


సాలూరు రూరల్: సాలూరు కృష్ణావతారంలో జగన్నాథుడు


జియ్యమ్మవలస: చినమేరంగిలో రామ అవతారంలో..


భామిని: బత్తిలిలో కల్కీ అవతారంలో జగన్నాథుడు

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

● వివిధ అవతారాల్లో దర్శనమిచ్చిన స్వామివారు

జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకొక అవతారంలో దర్శనమిస్తున్నారు. శుక్రవారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల రామ, కల్కీ, జగన్మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పార్వతీపురంటౌన్: కృష్ణావతారంలో


పాలకొండ: కల్కీ, జగన్మోహిని అవతారంలో


మోసూరులో భూ సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

● బురద రోడ్డు మీద బైక్‌పై వెళ్లిన ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

సాలూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయమైంది. దీంతో క్షేత్రపరిశీలన కోసం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ బైక్‌పై వెళ్లారు. పాచిపెంట మండలం మోసూరులో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ సమస్యలపై గ్రామసభ జరిగింది. నీటివనరుల సరిహద్దులు, పోరంబోకు భూముల సరిహద్దుల కచ్చితంగా ఉండాలని సూచించారు. మోసూరు చివరన ఉన్న సురగడవలస గ్రామం వైపు ఉన్న ఇందిర చెరువును పరిశీలించడానికి నిర్ణయించారు. ఆ మార్గం వర్షాల వల్ల బురదమయంగా ఉంది. దీంతో ఓ బైక్‌పై వెనుక కూర్చుని చెరువు వద్దకు వెళ్లారు. గ్రామసభలో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. రీ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. వీఆర్వోలు తమ లాగిలో సమస్యలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రత్యేక భూ కేసులకు సంబంధించి శిక్షణ ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.


చెరువు పరిశీలనకు బైక్‌పై బురదలో పయనిస్తున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

ర్యాలీలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

● ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా సంబంధిత డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసి అనుమతులు పొందాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

విజయనగరం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ స్థానిక పోలీసులు, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, ఈగల్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు రైళ్లల్లో గంజాయి రవాణా అవుతున్నదన్న సమాచారంతో తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందికి సూచనలు చేశారు. బ్యాగులను, లగేజీ సూటికేసులను నార్కోటిక్ డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు.


రైలు బోగిలో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేపడుతున్న పోలీసు సిబ్బంది

ఆపరేషన్ కగార్ మావోయిస్టుల అంతానికేనా?

● రాష్ట్ర ఇఫ్టూ అధ్యక్షుడు ప్రసాద్ ● బొబ్బిలిలో గంటి ప్రసాదం వర్ధంతి సభ


మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

బొబ్బిలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో గల 9 కోట్ల ఎకరాల భూములను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని రాష్ట్ర ఇఫ్టూ అధ్యక్షుడు పి.ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో స్మారక కమిటీ ఆధ్వర్యంలో గంటి ప్రసాదం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్మారక కమిటీ ప్రతినిధి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే మేధావులు, ప్రజాసంఘాల నాయకులపై పాలకులు ఉక్కుపాదంతో అణిచివేస్తుండడం పరిపాటైందన్నారు. యూపీఏ హయాంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ వస్తే ఎన్‌డీఏ హయాంలో ఆపరేషన్ కగార్ వచ్చిందన్నారు. మావోయిస్టులను వచ్చే మార్చి నెలాఖరుకు పూర్తిగా అంతమొందిస్తామని కేంద్ర హోంమంత్రి ముహూర్తం ఖరారు చేయడం ఎంత దుర్మార్గమన్నారు. బ్రిటీషు వారు వదిలి వెళ్లిననాటికి 40 శాతం ఉండే అడవులు నేడు 21 శాతానికి తగ్గిపోయాయన్నారు. అడవులకు సెక్యూరిటీ గార్డులుగా ఉన్న ఆదివాసీలను తరిమివేసే కుట్ర అమలవుతోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం నిత్యం అమరావతి తప్ప వేరే ధ్యాస లేదని, పచ్చని పంట పొలాలను కార్పొరేట్లకు అప్పగించేందుకు తన వంతు కృషి ముమ్మరం చేశారని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తొలుత రైల్వే రిటైర్డ్ అధికారి రంపా రాఘవరావు జెండాను ఆవిష్కరించి, ప్రసాదం చిత్రపటానికి పూలమాల వేసి, విప్లవాభివందనాలు తెలిపారు. ప్రజా కళా మండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. తమటాల అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, అమరుల బంధుమిత్రుల సంఘం ప్రతినిధులు అన్నపూర్ణ, అరుణ, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మెరిగాని గోపాలం, రిటైర్డ్ రైల్వే అధికారి రంపా రాఘవరావు, వి.లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.


గోరపాడు కొండ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

ఐదు రోజులుగా ఒకేచోట..

● మన్యంలో సంచరిస్తున్న ఏనుగులు

సీతంపేట రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మన్యంలో గత ఐదు రోజులుగా గజరాజులు గోరపాడు, చినబగ్గ, మోహనకాలనీ గ్రామాల సమీపంలోనే సంచరిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అడవి దట్టంగా ఉండడం, ఏనుగులకు సరిపడా ఆహారం, నీరు పుష్కలంగా లభిస్తుండడంతో ఇక్కడే తిష్ఠ వేసినట్లు ఆయా గ్రామాల గిరిజనులు చెబుతున్నారు. కొండపోడు పనులకు, పైనాపిల్ పంట సేకరణకు వెళ్లాలంటే భయంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు కోరుతున్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ల 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.